వైభవంగా గురుపౌర్ణమి

కొత్తకోట: పట్టణ శివారులో గల సంకల్ప సిద్ధిసాయి బాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం 7గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా వారి మూలవిరాట్‌కు పంచ నది జలాలు, పంచామృతం, పంచవర్ణాలతో అభిషేకం నిర్వహించడంతో పాటు సహస్ర పుష్పార్చన, నిరాజన, మంత్రపుష్పార్చనలు చేశారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి పోటెత్తారు. వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వస్తున్న ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు మధ్యాహ్నం అన్నదానం చేశారు. అనంతరం సాయంత్రం 5గంటలకు పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంట పల్లకీసేవ నిర్వ రాత్రి 9గంటలకు హారతి ఇచ్చారు.

ఆత్మకూర్: గురుపౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని శ్రీసాయిబాబా మందిరంలో భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున 5గంటలకు సుప్రభాతం, 5.30గంటలకు కాగడహారతి, 6.15నుంచి విఘ్నేశ్వర, నందీశ్వర, దత్తాత్రేయ, సంతాన నాగదేవత, జ్యోతిర్లింగ, రాంపరివార్, లక్ష్మీదేవి, షిర్డిసాయినాథ్‌లకు పంచామృతాభిషేకం, 8గంటలకు కావిడి ఉత్సవం, 9గంటలకు అర్చన, అష్టోత్తరం, మధ్యాహ్నం 12గంటలకు హారతి, 12.30గంటలకు అన్నదానం, సాయంత్రం 6.20గంటలకు దూపహారతి, 6.45కు సాయి భజన రాత్రి 7.30గంటలకు పల్లకీసేవ, 8.40గంటలకు సేజారతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దివాన్జీప్రభాకర్‌రావు, సంతోష్‌కుమార్, రమేష్‌శెట్టి, సింగం ఉదయ్, భక్తులు పాల్గొన్నారు.


పెబ్బేరులో షిరిడి సాయిబాబా ఆలయంలో సామూహిక సాయిసత్యవ్రతాలు చేస్తున్న మహిళలు

15ఏళ్లుగా భక్తులకు అన్నదానం

గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం వేలాదిమంది భక్తులకు కట్టెలమండి లక్ష్మి, యుగేంధర్ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. 15 ఏళ్లుగా అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్న వారికి ఆలయ నిర్వాహకులు సత్కరించి అభినందించారు.

పెబ్బేరు రూరల్: ఆషాఢ శుద్ధ పూర్ణిమ, వ్యాస పూర్ణిమ, గురు పౌర్ణమి సందర్భంగా షిరిడి సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని షిరిడి సాయిబాబా ఆలయంలో అర్చకులు నవీన్‌కుమారాచార్యులు ఉదయం కాగడ హారతితో బాబా వారి మేల్కొపు, అభిషేకం చేశారు. మహిళలు భారీగా పాల్గొని సామూహిక సాయి సత్యవ్రతాలు జరిపించారు. అనంతరం భక్తులతో భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ, మహామంగళ నీరాజనం అనంతరం పవలింపు సేవ చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సేవా సమితి సభ్యులు శ్రీనివాసులు, హన్మంతురెడ్డి, ఎల్లయ్య, శ్రీధర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, బాలరాజు, వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ్, కిషోర్, శేఖర్, రమేష్, శ్రీనివాసులుశెట్టి, సాయి భక్తులు పాల్గొన్నారు.

అమరచింత: పట్టణంలోని షిరిడిసాయి మందిరంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజ, అభిషేకం నిర్వహించారు. ఆలయంలో హోమం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి సాయి ఉత్సవ విగ్రహంతో పల్లకీ సేవా చేపట్టారు.


అమరచింత ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కొత్తకోటలోని సంకల్ప సిద్ధి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి


ఆత్మకూర్‌లో శ్రీదత్తాత్రేయ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వర్షానికి కూలిన ఇళ్లు.. తప్పిన ప్రమాదం


అమరచింతలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది


ఆత్మకూర్‌లో వర్షానికి కూలిన ఇల్లు

ఆత్మకూర్: ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఆత్మకూర్‌లోని వినాయకనగర్‌లో గొల్ల చెన్నమ్మకు చెందిన నివాస గృహం కూలిపోయింది. రెండురోజుల క్రితమే పరిస్థితి గమనించి ఖాళీ చేసి వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పింది. ఈమేరకు ఆదివారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయమ్మ బృందం ఇంటిని సందర్శించి వివరాలు సేకరించారు. పాత నివాస గృహాల్లో ఎవరూ ఉండకూడదని తహసీల్దార్ రాజు, ఎస్‌ఐ నరేందర్, ఎంపీడీఓ సుజాత అన్నారు. జూరాల రిజర్వాయర్ నుంచి లక్షకు పైగా క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతుండడంతో నదీతీర గ్రామాల్లోని రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అమరచింత: పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున రెండు మట్టి ఇళ్లు కూలిపోయాయని మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం తెలిపారు. మహంకాళి రఘు, శ్యాంకుమార్, రసూల్‌బీ, అచ్చుగట్ల రాజావతికి సంబంధించిన ఇళ్లు కూలుతున్నట్లు గుర్తించామన్నారు. కూలిన ఇళ్లకు చెందిన వారిని వారి బంధువుల ఇళ్లకు వెళ్లమని సలహా ఇచ్చామని, లేనిపక్షంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వసతి గృహంలో ఉండమని చెప్పినట్లు ఆయన వెల్లడించారు. సహాయక చర్యల్లో తమ సిబ్బంది పాల్గొంటున్నారన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 14వ వార్డులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఓ గేదె ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయకపోవడంతో గేదె చనిపోయిందని, ట్రాన్స్‌కో శాఖ అధికారులే పూర్తి బాధ్యత వహించి బాధిత రైతుకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. నిరంతరం మనుషులు తిరిగే రోడ్డు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన అధికారులు కంచె ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు ముందుస్తు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

కరెంటు పోల్‌కు కారు ఢీ

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల రోడ్డులో గంజికి ఎదురుగా ఆదివారం సాయంత్రం పెబ్బేరు వైపు నుంచి వస్తున్న కారు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న కరెంట్ ఇనుప స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో స్తంభం పూర్తిగా వంగి, రెండు బైకులు పూర్తి దెబ్బతిన్నాయి. దీంతో ప్రజలు పోలీసులు, విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే కరెంటు నిలిపి వేశారు. దీంతో వనపర్తి పట్టణంలో రెండు గంటల పాటు కరెంట్ అంతరాయం కలిగింది. పోలీసులు వాహనాలను డిపో రోడ్డులో మళ్లించి ట్రాఫిక్‌ను క్రమద్దీకరించారు. వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులు క్రేన్ సహయంతో కొత్త స్తంభం వేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు సంరక్షించాలి



పెబ్బేరు రూరల్: జిల్లా సాగర్ స్నేక్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం వనపర్తి మండలంలోని మెట్టుపల్లిలో మొక్కలు నాటారు. ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కృష్ణసాగర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో కార్బన్‌డయాక్సైడ్ రోజురోజుకూ పెరుగుతుందని, ఇక సుంచే అయిన నివారణ చర్యలు చేపట్టకపోతే రానున్న రోజుల్లో పెను ప్రమాదాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. భూగోళంపైన వేడి తాపం రోజురోజుకూ పెరుగుతుంది. భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రాఘవేంద్ర, రంగం మాసన్న, నరసింహ, గోపాల్ ఉన్నారు.

మల్లికార్జునఖర్గేను కలిసిన ఎమ్మెల్యే శ్రీహరి



ఆత్మకూర్: అఖిల భారత కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదినం సందర్భంగా ఆదివారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బెంగళూరులోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా పలు రాజకీయ, నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

వనపర్తిటౌన్: మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన బి. శ్రీనివాస్‌గౌడ్‌ను ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా కమిటీ సభ్యులు ఆదివారం ఆయన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీటీ శ్యామ్ మాట్లాడుతూ.. ఇది వరకే మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పని చేసిన అనుభవం, అవినీతి, దౌర్జన్యాల మరక లేని శ్రీనివాస్‌గౌడ్ రైతులకు మేలు చేస్తారని, శ్రీనివాస్‌గౌడ్‌కు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాలముకుంద, ఆంజనేయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాన్‌గల్‌కు మంత్రి జూపల్లి రాక

పాన్‌గల్: మండల కేంద్రంలో సోమవారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరవుతున్నట్లు తహసీల్దార్ సుభాష్ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ గ్రామాల లబ్ధిదారులు పాల్గొని మంజూరైన చెక్కులను పొందాలని సూచించారు.

వ్యవసాయ అధికారులతో రుణమాఫీ వివరాలు

వీపనగండ్ల: ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రైతు రుణమాఫీ వివరాలను తెలుసుకునేందుకు మండలంలోని క్లస్టర్ల వారీగా రైతువేదికలో ఉన్న ఏఈఓలను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ రైతులకు విజ్ఞప్తి చేశారు. పంట రుణాల మాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వమే క్షేత్రస్థాయి అధికారుల వద్ద అవసరమైన వివరాలను అందుబాటులో ఉంచిందని తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదార్ పాసుపుస్తకం, బ్యాంక్ అకౌంట్ పాసుబుక్కు జిరాక్స్ కాపీలను ఏఈఓల దగ్గరకు తీసుకొని వెళ్లి రుణమాఫీ వివరాలను తెలుసుకోవాలని ఆయన సూచించారు.

బాధితురాలికి పరామర్శ

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు కతాల్ భార్య బాలీశ్వరమ్మ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతుంది. స్థానిక నాయకులతో విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఆదివారం ఆస్పత్రిలో ఆమెను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాధితురాలి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెబ్బేరు రూరల్: వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న నివాస గృహాల్లో నివసిస్తున్న వారు ఇళ్లను ఖాళీ చేయాలని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి సూచించారు. మండలంలోని జనుంపల్లి, పెంచికలపాడు, మునగమోనిదిన్నె గ్రామాల్లో పోలీసులు ప్రజలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఇంట్లో నిరుపయోగంగా ఉన్న పాత వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆత్మకూర్: జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం ఆత్మకూర్ మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుంటిపల్లికి చెందిన గట్టన్న (35) అప్పులు, ఇతర సమస్యలతో ఇబ్బందులు పడుతూ ఈ నెల 1న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆత్మకూర్ ప్రభుతాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్సల అనంతరం వనపర్తి ఆస్పత్రికి తీసుకెళ్లారు. నాలుగు రోజులపాటు అక్కడ చికిత్స పొంది వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య జయమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారని, మృతుడి తల్లి బాలకిష్టమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హజ్ యాత్రికుడికి సన్మానం



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకుడు జలీల్ తల్లిదండ్రులు ఖలీల్‌సాబ్ దంపతులు పవిత్ర హజ్ యాత్రకు వెళ్తున్న సందర్భంగా ఆదివారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ముస్లింలు పవిత్ర క్షేత్రం హజ్ యాత్రకు వెళ్లడం పూర్వజన్మ సుకృతం అన్నారు. కార్యక్రమంలో నందిమల్ల అశోక్, పృథ్వీరాజు, రాజు, గౌడనాయక్, సుదర్శన్‌రెడ్డి, అంజి, అర్జున్, వెంకటేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు విరాళం అందజేత


హెచ్‌ఎంకు విరాళం అందజేస్తున్న రైతులు

పెబ్బేరు రూరల్: మండలంలోని యాపర్లలో రైతు సంఘం సభ్యులు ఆదివారం జిల్లా పరిషత్ పాఠశాలకు రూ.20 వేలు, ప్రాథమిక పాఠశాలకు రూ 10 వేల విరాళాన్ని హెచ్‌ఎం శంకర్‌గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యా వలంటీర్ల నియామకంతో పాటు పాఠశాల ఇతర అవసరాల ఖర్చు చేయలని సూచించారు. భవిష్యత్‌లో పాఠశాల అభివృద్ధి కోసం ముందుంటామని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి విరాళం అందించిన రైతు సంఘాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మైనోద్దీన్, రైతు సంఘం అధ్యక్షుడు బోయ గోకారి, నాయకులు స్వరాజ్యం, బాబురెడ్డి, మాజీ ఎంపీటీసీ విక్రంగౌడ్, మన్యం, వేణుగోపాల్, పెంటన్న, శ్యామ్, భీముడు, శ్రీరాములు పాల్గొన్నారు.

సేవ చేయాలనే సంకల్పం గొప్పది


అంధ విద్యార్థుల శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, నిర్వాహకులు, విద్యార్థులు

ఆత్మకూర్: అంధ విద్యార్థులకు ఉచితంగా వసతితో కూడిన కంప్యూటర్ శిక్షణ ఇవ్వాలనే సంకల్పం ఎంతో గొప్పదని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి రవి కుమార్ అన్నారు. ఆదివారం ఆత్మకూర్‌లో సమ్మిళిత ఫౌండేషన్, హెల్ప్‌ఫర్ ద బ్లైండ్ సంస్థల ఆధ్వర్యంలో అంధ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని చైర్‌పర్సన్ గాయత్రి ప్రారంభించారు. ఈ అవకాశాన్ని ఆత్మకూర్‌తో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన అంధ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అశ్విన్‌కుమార్, మండ్లరామకృష్ణ, మాజీవార్డు సభ్యుడు గడ్డమీది శ్రీనివాసలు, సాఫ్ట్‌వేర్ కుర్ని రవికాంత్, సంస్థల నిర్వాహకులు గణేష్‌రెడ్డి, గాండ్ల శివకుమార్, అరుణ్, స్థానికులు, అంధ విద్యార్థులు పాల్గొన్నారు.

సమాధులు ధ్వంసం.. కేసు నమోదు


ఆత్మకూర్ ఖబ్రస్తాన్‌లో ధ్వంసమైన సమాధులను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

ఆత్మకూర్: పట్టణంలోని సర్వేనంబర్ 1 లోని రెండు ఎకరాల్లో ముస్లింల ఖబ్రస్తాన్(శ్మశానవాటిక)లో సమాధుల ధ్వంసంపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. ఆదివారం వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శివకుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. అతిపురాతనమైన శ్మశాన వాటికలోని సమాధులను ధ్వంసం చేసి, ఎంతో విలువైన స్థలాన్ని కబ్జాచేసేందుకు కొందరు ప్రత్నిస్తున్నారని అందులో భాగంగానే ఈ దుశ్చర్యకు పాల్పడుతున్నారని ముస్లింలు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలోనూ సమాధులను ధ్వంసం చేశారని, ప్రస్తుతం జేసీబీ ద్వారా సమాధులను పెకిలించి కబ్జాకు ప్రయత్నిస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయమై కేసు నమోదు చేశామని పూర్తిస్థాయిలో విచారణ అనంతరం దోషులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీనిచ్చారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

అమరచింత: పర్యావరణ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రకృతిని ఎంతగా కాపాడుకుంటే అది అంతకు రెట్టింపు ఆరోగ్యకర వాతావరణం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐ శివకుమార్, ఎస్‌ఐ సురేష్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

కొత్తకోట రూరల్: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ముందు వెళ్తున్న ఓ వాహనాన్ని ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున నాటవెల్లి ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు వీఆర్‌సీఆర్ సంస్థకు చెందిన ప్రైవేట్ బస్సు హైదరాబాద్ నుంచి చిత్తూరు జిల్లాలోని మదనపల్లికి 26మంది ప్రయాణికులతో బయలుదేరింది. ఆదివారం తెల్లవారుజామున వనపర్తి జిల్లా కొత్తకోట మండలం నాటవెల్లి సమీపంలోకి రాగానే బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొనడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన గల డివైడర్‌పైకి దూసుకెళ్లి ఆగిపోయింది. బస్సులో గాఢనిద్రలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బస్సులో ప్రయాణిస్తున్న గుండె శ్రీనివాసులు అనే ప్రయాణికుడికి గాయాలయ్యాయి. ప్రమాదంతో తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కుర్మయ్యగౌడ్ ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయ కమిటీ నియామకం

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని కడుకుంట్లలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద గ్రామ ప్రజలు సమావేశమై ఆంజనేయస్వామి ఆలయం, పెద్దమ్మ గుడికి సంబంధించిన నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మూలమళ్ల కృష్ణకుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జీపీ వెంకటేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌సాగర్, కార్యదర్శులుగా బుచ్చారెడ్డి, కృష్ణయ్య, భారతయ్యతో పాటు సలహదారులతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ కాలపరిమితి రెండేళ్ల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో చల్మారెడ్డి, నాగన్‌గౌడ్, బుచ్చన్న సాగర్, శేఖర్‌సాగర్, బీచుపల్లి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం



అమరచింత: ఎన్‌ఐటీలో సివిల్ ఇంజినీర్ కోర్సు చదువుకుంటున్న గౌరి అనే విద్యార్థిని ఆర్థికంగా ఇబ్బందులతో ఉన్న విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన జరిచీరల వ్యాపారి మహంకాళి శ్రీనివాసులు ఆర్థికసాయం అందించారు. మదనాపురం మండలం బొగ్గులోనితండాకు చెందిన గౌరి ఎన్‌ఐటీలో సివిల్ ఇంజినీర్ కోర్సులో మణిపూర్ రాష్ట్రంలో సీటు వచ్చింది. అమ్మాయి కుటుంబం పేదరికంలో ఉండడంతో ఆమె ఉన్నత చదువుల కోసం శ్రీనివాసులు రూ.1.50లక్షల ఆర్థికసాయం అందించారు. గౌరి చదువుల కోసం తన వంతు సాయం అందించడానికి ముందుటానని గౌరి తండ్రి ముడావత్ శ్రీనుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మహంకాళీ విష్ణు, రామలింగం, తిరుమలేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొలువుదీరిన కొడిపీర్లు



ఆత్మకూర్: పట్టణంలోని రాజవీధిలో కొడిపీర్లు కొలువుదీరాయి. స్థానిక కోట వీధిలోని మసీదులో ఇమామే మౌలాలీ, ఇమామే జలాలి, ఇమామే ఖాసీం, హుస్సేనీఆలం, ఇమామేహస్సన్ ఆలంలను ప్రతిష్టించారు. ఆదివారం గౌస్‌సాహేబ్ ఆధ్వర్యంలో స్థానికులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ నెల 25 వరకు చిన్న గంధం, 26న మౌలాలి జ్యారత్‌లు, 27న గంధోత్సవం, 28న రాత్రి పీర్ల ఊరేగింపు, 29న సోమవారం సాయంత్రం జరిగే మొహర్రం వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

కేజీబీవీలో క్రీడా ప్రాంగణం పనులు ప్రారంభం



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఇంగ్లిష్ మీడియం కస్తూర్బాగాంధీ పాఠశాల ఆవరణలో క్రీడా ప్రాంగణం పనులు ఆదివారం ప్రారంభించారు. శనివారం పాఠశాలకు వచ్చిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలిసిన విద్యార్థులు తమకు ఆడుకోవడానికి క్రీడాప్రాంగణం లేదని తెలిపారు. ఆవరణలో ఉన్న రాళ్లు, పిచ్చి మొక్కలను తొలిగించి చదును చేయిస్తే ఆడుకోవడానికి వీలుంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఆదివారం రెండు హిటాచీలను అక్కడికి పంపి పనులు చేశారు. ఎమ్మెల్యే సూచనల మేరకు సింగిల్‌విండో వైస్ చైర్మన్ క్యామ రాజు, జన్ను మధు, యాదగిరి, మునగాల బాబు తదితరులు పనులు పర్యవేక్షించారు.

రోడ్డుపై విద్యుత్ స్తంభం తొలగించండి



వీపనగండ్ల: నూతనంగా వేసిన సీసీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం వల్ల వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఆ విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని పుల్గర్‌చర్ల గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో మంజూరు అయిన డబుల్ సీసీ రోడ్డుకు గాను సింగిల్ రోడ్డు వేయడం వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నోమార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శివపార్వతుల కల్యాణం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఆదిదంపతులైన శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ వారు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం ఉంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలి వచ్చారు. శివపార్వతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా ఆడపడుచులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

వానరానికి అంత్యక్రియలు

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో ఆదివారం వీధికుక్కల దాడికి గురై మృతిచెందిన వానరానికి గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. వానరుడు సాక్షత్తు ఆంజనేయస్వామి స్వరూపమని భావించిన గ్రామస్తులు మృతిచెందిన వానరాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి శివారులో కననం చేశారు. గ్రామంలోని వీధి కుక్కల నివారణకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సోమనాథ్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, దర్గేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

